క్లుప్తంగా

విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలు

చింతపల్లి: ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో పెంచిన అడ్మిషన్ ఫీజులను తగ్గించాలని, మన్యంలో విద్యాలయాల్లో సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సోమవారం భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి జీవన కృష్ణ మాట్లాడుతూ ఫీజులు పెంచడం వల్ల పేద గిరిజన విద్యార్థులు చదువుకు దూరమవుతున్నారన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల మృతిపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని, ఆశ్రమ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న వాచ్‌మెన్, కుక్ పోస్టులను భర్తీ చేయాలని, జీవో నెంబర్–3 అమలుచేయాలని కోరుతూ తహసీల్దార్ రవికుమార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్తీక, శ్రీను, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు


మాట్లాడుతున్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష

ముంచంగిపుట్టు: విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో ఉపాధ్యాయులు బోధించాలని ఎంపీడీవో ఎం.శ్రీసాయిహర్ష అన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలుర పాఠశాల–2 లో ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న శిక్షణ తరగతులు సోమవారంతో ముగిశాయి. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీడీవో శ్రీసాయిహర్ష మాట్లాడుతూ మెరుగైన బోధనతో ఉత్తమ ఫలితాలు పొందవచ్చన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని, బోధన నైపుణ్యాలను మెరుగుపర్చుకోవాలని, మెనూ ప్రకారం భోజనం అందజేయాలని సూచించారు. ఎంఈవో కె.కృష్ణమూర్తి, డీఆర్పీలు సూర్యనారాయణ, దాసయ్య, కామేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం



నగదు అందిస్తున్న దాతలు

ఎటపాక: మండలంలోని నల్లకుంట పంచాయతీ రాఘవాపురం గ్రామంలో మృతి చెందిన ఓ కుటుంబానికి జమాల్‌ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం నగదు అందజేశారు. గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన సొందె కాంతమ్మ అనే గిరిజన మహిళ అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి అంత్యక్రియ నిర్వహణకు ట్రస్టు నిర్వాహకులు రూ.5 వేల నగదు అందజేశారు.కణితి మధు, గంగాధర్, నాగేశ్వరావు, రాజమ్మ, భద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ సమావేశం రేపు

కూనవరం/చింతూరు: చింతూరు, కూనవరం మండలాల్లోని గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకుల సమావేశం బుధవారం నిర్వహిస్తున్నట్టు పార్టీ కన్వీనర్లు ఎగమంటి రామలింగారెడ్డి, ఆలూరి కోటేశ్వరరావులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా వీఆర్ పురం మండలం రామవరం పంచాయతీ సోములగూడెం గ్రామంలో, చింతూరు, విఆర్ పురం మండలాల వైఎస్సార్‌సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఉదయం 10గంటలకు, కూనవరం మండలం, టేకులబోరు గ్రామంలో మధ్యాహ్నం 2గంటలకు పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులతో సమావేశం జరగనున్నట్టు పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్, రంపచోడవరం మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి నాగులపల్లి ధనలక్ష్మి పాల్గొంటారని తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

మండల సమావేశం రేపు


రాజవొమ్మంగి: మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోము వెంకటలక్ష్మి అధ్యక్షతన బుధవారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో యాదగిరీశ్వరరావు తెలిపారు. అధికారులు సంబంధిత పనులకు సంబంధించి రికార్డులను ఒకరోజు ముందుగానే కార్యాలయంలో అందజేయాలని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

శివోహం


అరకులోని శివాలయంలో పూజలు చేస్తున్న భక్తులు


కురిడిలోని మల్లికార్జునస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

- శివాలయాల్లో కార్తీక మాసం తొలి సోమవారం ప్రత్యేక పూజలు
- భక్తులతో కళకళలాడిన ఆలయాలు
- మార్మోగిన శివనామ స్మరణ


గుమ్మకోటలోని మల్లేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


చింతపల్లి శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు


సంతబయలులో శివాలయంలో భక్తులు


సీలేరు శివాలయంలో పూజలు చేస్తున్న అర్చకుడు


పూతిగుంట పరమేశ్వరుని దర్శించుకుంటున్న భక్తులు


హుకుంపేటలోని మత్స్యగుండం శివాలయంలో భక్తుల ప్రత్యేక పూజలు

అరకులోయ టౌన్/అనంతగిరి(అరకులోయ రూరల్)/దుంబ్రిగుడ/ చింతపల్లి/కొయ్యూరు/ జి.మాడుగుల/సీలేరు/రాజవొమ్మంగి/ వై.రామవరం/కూనవరం : కార్తీక మాసం తొలి సోమవారం పురస్కరించుకొని శైవక్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఓం నమఃశివాయ అనే పంచాక్షరీ మంత్రాన్ని పఠిస్తూ భోళా శంకరుడ్ని దర్శించుకున్నారు. శివాలయాల్లో తెల్లవారుజామున నుంచి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వేకువజామునే భక్తులు సమీపంలో నదులు, కొలనులకు వెళ్లి పుణ్యస్నానాలు ఆచరించారు. అరటిడొప్పల్లో నేతితో తడిపిన ఒత్తులు వెలిగించి నీటిలో వదిలిపెట్టారు. కొందరు ఇంటివద్దనే దీపాలు వెలిగించి పసుపుకుంకుమలు, నైవేద్యం సమర్పించారు. అనంతరం వాటిని నీటిలో వదిలిపెట్టారు. భక్తులతో ఆలయాలన్నీ కళకళలాడాయి. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన నిర్వహించారు. శివ శంకరుడుని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. భక్తిశ్రద్ధలతో దీపారాధన నిర్వహించారు. శివనామ స్మరణతో గ్రామాలన్నీ మార్మోగాయి


కొయ్యూరులోని మల్లికార్జున స్వామి ఆలయంలో అభిషేకాలు చేస్తున్న భక్తులు


కూనవరంలో భక్తులు


జడ్డంగిలో దీపారాధన

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం


సుజనకోటలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి రమేష్


గర్భిణులకు అవగాహన కల్పిస్తున్న హెచ్‌వీ లక్ష్మి

ముంచంగిపుట్టు: మండలంలోని సుజనకోటలో కిలగాడ వైద్యాధికారి ఎస్.రమేష్ ఆధ్వర్యంలో సోమవారం వైద్య శిబిరం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, అనారోగ్యమైతే వెంటనే ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందాలని సూచించారు. శిబిరంలో 56 మందికి వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు అందజేసినట్టు చెప్పారు. వైద్య సిబ్బంది సుబ్రహ్మణ్యం, అశోక్, లలిత, పుణ్యవతి తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని టి.పి.వీడు గ్రామ సచివాలయం పరిధిలో గౌరీదేవిపేట పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా సచివాలయంలో గర్భిణులు, బాలింతలకు వైద్య పరీక్షలు చేశారు. గ్రామంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


అంగన్‌వాడీల ధర్నా


గంగవరం ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీలు

గంగవరం : అంగన్‌వాడీ సిబ్బందిపై అధికారుల వేధింపులను నిరసిస్తూ సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీలు ధర్నా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా అధ్యక్షురాలు మట్టల వాణిశ్రీ, ఉపాధ్యక్షులు శాంతిరాజు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా వాణిశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణలో అంగన్‌వాడీ వర్కర్లు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యల పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని, సిబ్బందిపై వేధింపులు మానుకోవాలన్నారు. మండలంలో అంగన్‌వాడీ వర్కర్లు ఎదుర్కొంటున్న సమస్యలను అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి నిర్మల, ప్రాజెక్టు అధ్యక్షురాలు నాగదేవి, కార్యదర్శి రాణి తదితరులు వివరించారు. అధికారుల వేధింపులు, సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకోకపోతే ఆందోళన ఉధృతం చేస్తామన్నారు. సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ సన్మానం


ఎస్‌ఐ రామకృష్ణను సన్మానిస్తున్న సిబ్బంది


కార్యదర్శి వరలక్ష్మిను సన్మానిస్తున్న గ్రామస్తులు

సీలేరు: సీలేరులో ఎస్‌ఐగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్తున్న రామకృష్ణను సిబ్బంది సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఆయనకు శాలువ కప్పి సన్మానించి జ్ఞాపికను అందజేశారు. పోలీసు స్టేషన్ సిబ్బంది, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని కర్రిముఖిపుట్టు గ్రామ సచివాలయంలో పంచాయతీ కార్యదర్శిగా పనిచేసి బదిలీపై వెళ్తున్న దూరు వరలక్ష్మిను స్థానిక సర్పంచ్ పోల్‌మొత్తి ఆధ్వర్యంలో సోమవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్‌తో పాటు స్థానిక నేతలు, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు వరలక్ష్మికి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. ఆమె చేసిన సేవలను కొనియాడారు. ఉప సర్పంచ్ యశోద, వైఎస్సార్‌సీపీ నాయకులు అర్జున్, రాంప్రసాద్, జోగారావు, లక్ష్మణ్, పద్మ, సచివాలయ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత


అరకులోయలో చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

అరకులోయ టౌన్: నెహ్రూ యువ కేంద్రం (విశాఖపట్నం) ఆధ్వర్యంలో సోమవారం అరకులోయలో దివాళీ విత్ మై భారత్ కార్యక్రమంలో భాగంగా క్లీన్‌నెస్ డ్రైవ్ కార్యక్రమాన్ని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సారథ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా అరకు పరిసర ప్రాంతాలతో పాటు మెయిన్‌రోడ్డులోని పేరుకుపోయిన చెత్తను తొలగించారు. ఎన్‌ఎస్‌ఎస్ పీవోలు పి నాగబాబు, వై.విజయలక్ష్మి, ఎం.అనితకుమారి కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యతగా తీసుకోవాలన్నారు. పర్యాటక కేంద్రంగా పేరొందిన అరకులోయను అందంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు.

జల ఉత్సవ్‌పై అవగాహన


మాట్లాడుతున్న ఎంపీడీవో బాపన్నదొర

వై.రామవరం: మండలంలోని అన్ని పంచాయతీల్లో ఈనెల 7 నుంచి 20వ తేదీ వరకు నిర్వహించే జల ఉత్సవ్ కార్యక్రమంపై మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీవో కె.బాపన్నదొర ఆధ్వర్యంలో స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈనెల 6న ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ప్రారంభించనున్నట్టు తెలిపారు.

గ్రామాల్లో వీధిలైట్ల ఏర్పాటు


ఏర్పాట్లను పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేశ్వరరావు

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం పంచాయతీలోని పాతవెలగలపాలెం, కొత్తవెలగలపాలెం, బోర్నగూడెం, మిరియాలవారి వీధిలో వీధిలైట్లు లేక పడుతున్న ఇబ్బందులు తొలగాయి. సర్పంచ్ నాగేశ్వరరావు చొరవ చూపి విద్యుత్ స్తంభాలు ఏర్పాటుచేసి లైట్లు వేయించారు. విద్యుత్‌లైన్లను బాగుచేయించారు. దీంతో స్థానికులు ఆనందం వ్యక్తం చేశారు. సంజీవ నగరం, చెరకుంపాలెం, మర్రిపాలెంలలో కూడా వీధిలైట్లు వేయాలని స్థానికులు అధికారులను కోరుతున్నారు.

ఆశాజనకంగా ధరలు.. ఆనందంలో రైతులు


పెదబయలు సంతలో విక్రయించేందుకు తీసుకొచ్చిన కూరగాయలు


వారపు సంతలో విక్రయానికి తీసుకొచ్చిన బస్తరు పిక్కలు

- జోరుగా కూరగాయల విక్రయాలు
- అటవీ ఉత్పత్తులకు డిమాండ్
- గిట్టుబాటు ధరలు

పెదబయలు: పెదబయలు వారపు సంతలో సోమవారం కూరగాయల అమ్మకం ఎక్కువగా జరిగింది. పెదబయలు, ముంచంగిపుట్టు మండలాల నుంచి రైతులు వచ్చి కూరగాయాలు అమ్మకాలు చేశారు. ఒక్క ప్యాకెట్ రూ.500 నుంచి రూ.1000 వరకు 10, 15, 20 కిలోలకు అనుగుణంగా అమ్మకాలు చేశారు. పెదబయలు, ముంచంగిపుట్టు, అరకు, డుంబ్రిగుడ, హుకుంపేట. భూసిపుట్టు, పాడేరు. జి.మాడుగుల,అనంతగిరి సంతల్లో కూర గాయలకు మంచి డిమాండ్ నెలకొంది. ఒడిశా జైపూర్, జగదల్‌పూర్, సరిహద్దు ప్రాంతాల నుంచి కూరగాయలను తీసుకొచ్చి విక్రయించారు.

బస్తరు పిక్కలకు గిరాకీ

పెదబయలు: గిరిజన ప్రాంతంలో పండించే బస్తరు పిక్కల ధర ప్రస్తుతం బాగుంది. పెదబయలు వారపు సంతలో సోమవారం బస్తరు పిక్కలు కిలో రూ.180 ధరతో మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేశారు. సంతలో ఈ వారం నుంచి గిరిజన రైతులు బస్తరు పిక్కలను అమ్మకానికి తీసుకొచ్చారు. ఈ వారం తక్కువగా బస్తర్లు రావడంతో ఎక్కువ ధరతో కొనుగోలు చేశారు. ప్రతీ ఏడాది పంట ప్రారంభంలో ఎక్కువ ధరతో మైదాన ప్రాంత వ్యాపారులు కొనుగోలు చేస్తుంటారని రైతులు చెబుతున్నారు. అయితే అన్ని ప్రాంతాల్లో ఒకేసారి పంట చేతికందడంతో సంతలకు బస్తరు పిక్కలను గిరిజన రైతులు ఎక్కువ మొత్తంలో తీసుకొస్తుంటారని చెప్పారు. దీంతో మైదాన వ్యాపారులంతో సిండికేట్‌గా మారి తక్కువ ధరలు కొనుగోలు చేస్తుంటారని, కనీస ధరలు రాకపోవడంతో నష్టాలు చవిచూడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బస్తరు పిక్కలను గిరిజనులు వంటకాల్లో ఎక్కువగా వినియోగిస్తారు. ప్రసుత్తం సంతల్లో బస్తరు పిక్కలకు మంచి ధరలు వస్తుండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పెట్రోల్ బంకులో మరమ్మతు పనులు

సాక్షి ఎఫెక్ట్..


బంకులో మరమ్మతు పనులు చేస్తున్న సిబ్బంది

సీలేరు: సీలేరులో జీసీసీ పెట్రోల్ బంకులో పంపింగ్ సమస్య తలెత్తడంతో వినియోగదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై 'సాక్షి'లో ఈనెల 4న ప్రచురించిన కథనంపై అధికారులు స్పందించారు. పెట్రోల్ బంకు సూపర్‌వైజర్ రామకృష్ణ, హెచ్‌పీసీఎల్ టెక్నిషియన్లను తీసుకొచ్చి సోమవారం పరిశీలించగా ట్యాంకరులో మోటార్ పాడైనట్టు గుర్తించారు. దీంతో మరో మోటారును అమర్చి రెండు పంపులు పనిచేసేలా అమర్చారు. దీంతో వినియోగదారుల ఇబ్బందులు తొలిగాయి. మిగిలిన రెండు పంపుల మరమ్మతుల కోసం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశామని, మరో రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని సూపర్‌వైజర్ రామకృష్ణ తెలిపారు.

రాయితీ కల్పించాలని ఆందోళన


ఆందోళన చేస్తున్న రైతులతో గిరిజన సంఘం నాయకులు

ముంచంగిపుట్టు: మండలంలోని దొడిపుట్టు గ్రామానికి చెందిన గిరిజన రైతులకు విత్తనాలు, వ్యవసాయ పనిముట్లులో ప్రభుత్వం రాయితీలు కల్పించాలని గిరిజన సంఘం మండల అధ్యక్షుడు ఎం.ఎం.శ్రీను అన్నారు. కూరగాయల రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ రైతులతో గిరిజన సంఘం నాయకులు సోమవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షుడు శ్రీను మాట్లాడుతూ గిరిజన కూరగాయల రైతుల సాగుకు పెట్టుబడి సాయం అందించాలని, రాయితీలు కల్పించి విత్తనాలు, పనిముట్లు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పండించే కూరగాయలను గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలకు సరఫరా చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కూరగాయల రైతుల ఆర్థికాభివృద్ధికి ఐటీడీఏ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని ఆయన కోరారు. అనంతరం గిరిజన కూరగాయల ఉత్పత్తిదారుల సంఘం ఎన్నికను నిర్వహించారు. అధ్యక్షుడిగా లక్ష్మణరావు, ఉపాధ్యక్షుడిగా ఉర్ధూవ్, కార్యదర్శిగా సైబన్‌లతో పాటు 10మంది సభ్యులను ఎన్నుకున్నారు. లక్ష్మీపురం సర్పంచ్ త్రినాథ్, సంఘం నేతలు భీమరాజు, డోంబ్రు, ముకుంద్, పరమేష్, గోపాల్‌తో రైతులు పాల్గొన్నారు.

సమయపాలన తప్పనిసరి


విద్యార్థుల నోటు పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఈవో సుందర్‌రావు

డుంబ్రిగుడ: మండలంలోని కురిడి ప్రభుత్వ పాఠశాలను ఎంఈవో శెట్టి సుందర్‌రావు సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థులకు పలు సబ్జెక్టులలో ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. విద్యా సామర్థ్యాన్ని పరిశీలించారు. పాఠశాలలో బోధన, మెనూ అమలు, సమస్యలు తదితర విషయాలను అడిగి తెలుసుకున్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని ఉపాధ్యాయులను హెచ్చరించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బోధించాలని, హోమ్‌వర్క్ కచ్చితంగా చేయించాలని సూచించారు. ప్రతి వారం పాఠశాలల్లో తనిఖీ నిర్వహించి బోధనపై అవగాహన కార్యక్రమాలు, మధ్యాహ్న భోజనాల తనిఖీలు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఉపాధ్యాయురాలు శ్యామల తదితరులున్నారు.

అధికారులు బాధ్యతల స్వీకరణ


సీఐ వినోద్‌బాబు

చింతపల్లి: చింతపల్లి సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వినోద్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన సీఐ రమేష్‌కు విశాఖపట్నం వీఆర్‌కు అటాచ్ చేశారు. ఆయన స్థానంలో అనకాపల్లి జిల్లాలో సైబర్ క్రైం సీఐగా విధులు నిర్వహిస్తున్న వినోద్‌బాబును ఇక్కడ సీఐగా ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ఆయన బాధ్యతలు స్వీకరించి మాట్లాడతూ శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

ఎస్‌ఐగా రామకృష్ణ



ముంచంగిపుట్టు: ముంచంగిపుట్టు ఎస్‌ఐగా జె.రామకృష్ణ సోమవారం బాధ్యతలు చేపట్టారు. సీలేరు పోలీసు స్టేషన్‌లో ఎస్‌ఐగా పనిచేస్తూ బదిలీపై ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ రవీంద్ర సీలేరు ఎస్‌ఐగా బదిలీ అయ్యారు. నూతన ఎస్‌ఐగా బాధ్యతలను చేపట్టిన రామకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా విధులు నిర్వహిస్తానని, ముఖ్యంగా దొంగతనాలపై ప్రత్యేక దృష్టి పెడతానని, మండల ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. బాధ్యతలు చేపట్టిన ఎస్‌ఐ రామకృష్ణకు స్థానిక సిబ్బంది పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. ఏఎస్‌ఐ తిరుపతిరావు పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా రామకృష్ణ



రంపచోడవరం: రంపచోడవరం తహసీల్దార్‌గా టి.రామకృష్ణ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని రెవెన్యూకు సంబంధించిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఇప్పటి వరకు ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన సత్యనారాయణ రాజవొమ్మంగికి బదిలీ అయ్యారు.

అర్హులైన పట్టభద్రులను గుర్తించాలి


సూచనలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

అడ్డతీగల: ఎమ్మెల్సీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పట్టభద్రుల ఓటు హక్కు నమోదుపై ఎన్నికల కమీషన్ ఆదేశాల మేరకు వివిధ వర్గాలతో సమావేశం నిర్వహించినట్టు తహసీల్దార్ సీహెచ్ శ్రీనివాసరావు చెప్పారు. స్థానిక రాజకీయ పార్టీల నేతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యాలయాల ప్రతినిధులతో ఆయన సోమవారం సమావేశం నిర్వహించారు. పట్టభద్రులను గుర్తించి, వారిని ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఆయా దరఖాస్తులను ఈనెల 6లోగా కార్యాలయంలో అందజేయాలని సూచించారు.